పోరాట నామ సంవత్సరం

2023 రౌండప్

న్యూఢిల్లీ : కాలగర్భంలో మరొక ఏడాది కలిసిపోయింది. 2023 గత జ్ఞాపకంగా మిగిలిపోయింది. అయితే 2023ను పోరాట నామ సంవత్సరంగా మనకు గుర్తుండిపోతుంది. కేంద్రంలో ప్రధానమంతి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా,కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా 2023లో అనేక ప్రజా పోరాటాలు, ఆందోళనలు జరిగాయి. ఈ ఐక్య పోరాటానికి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే పూర్తి శక్తి ఉంది. అలాగే కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం పావులుగా ఉపయోగించుకోవడంపైనా పోరాటాలు ఉధృతమ య్యాయి. 2023లో జరిగిన కొన్ని ముఖ్యమైన రాజకీయ పరిణామలు..

జర్నలిస్టులపై దాడులు

ప్రతిపక్ష నేతలతో పాటు తమకు వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న ఉద్యమకారులు, జర్నలిస్టులపై మోడీ ప్రభుత్వం నిరంకుశ దాడులకు పాల్పడింది. అక్టోబర్‌లో ఢిల్లీ పోలీసులు సమారు 50 మంది జర్నలిస్టులు, రచయితల ఇళ్లపై దాడులు చేశారు. 'న్యూస్‌క్లిక్' వెబ్‌సైట్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, న్యూస్ మీడియా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అమిత్ చక్రవర్తిలను అరెస్ట్ చేశారు. వీరిద్దరిపై ఉపా చట్టం కింద కేసు బనాయించింది. జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేసి ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు పోలీసులు ఎత్తుకెళ్లారు. రాజధాని ఢిల్లీలోనే కాదు ఏకంగా 5 నగరాల్లో దాదాపు యాభై చోట్ల పోలీసులు దాడులు చేశారు. ఎడిటర్స్ గిల్డ్‌తో సహా అనేక జర్నలిస్టుల సంస్థలు ఈ ఆపరేషన్‌ను ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించాయి.

ఫోన్లపైనా..నిఘా

మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను, జర్నలిస్టులను వేధించడంతో వారి ఫోన్లను స్పైవేర్‌తో నిఘా ఉంచుతుందనే వార్తలు 2023లో వెలుగు చూడ్డం పెద్ద ఎత్తున కలకలం రేపింది. సంవత్సర ప్రారంభంలో ఇలాంటి వార్తలు వచ్చాయి. చివరిలో కూడా సీతారాం ఏచూరి, రాహుల్ గాంధీ, శశి థరూర్ వంటి ప్రతిపక్ష నేతల ఫోన్‌లు హ్యాక్ అవుతున్నాయని ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ నుంచి హెచ్చరికలు అందాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలోని హ్యాకర్లు ఈ పని చేస్తున్నారని, ఎవరు ఏం చేస్తారో తెలుసుకోవడానికి ఫోన్‌లను హ్యాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఐఫోన్ హెచ్చరించినట్లు ఈ నాయకులు తెలిపారు. సంవత్సరంలో ముందుగా వచ్చిన పెగాసస్ స్పైవైర్ ఆరోపణలపై మోడీ ప్రభుత్వం ఇప్పటి వరకూ సమాధానం చెప్పలేదు. ఇక ఐఫోన్ హ్యాకింగ్ ఆరోపణలపై అస్సలు స్పందించనేలేదు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

2023లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వార్తల్లోని నిలిచిన మరొక ముఖ్యమైన అంశం. అయితే ఈ ఎఐ కొత్త ఆశలను, భయాలను రెండింటినీ పెంచింది. 2023లో భారతదేశపు మొట్టమొదటి కృత్రిమ మేధస్సుతో నడిచే న్యూస్ రీడర్ ఒక టెలివిజన్ ఛానెల్‌లో దర్శనమిచ్చి అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఇప్పటికే మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థలో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నా యని, ఎఐ విస్తృత ఉపయోగంతో కొన్ని రంగాల్లో అవకాశాలు మరింత మృగ్యమవుతాయని ఆందోళనలు పెరిగాయి. అయితే ఎఐతో కొన్ని ఉద్యోగాలు పెరుగుతాయని నిపుణులు అంటున్నారు.

17 రోజులు సొరంగంలోనే.

ఉత్తరాఖండ్‌లోని సిల్కియారా సొరంగంలో 17 రోజులు పాటు 41 మంది కార్మికులు చిక్కుకుని ఉండటం అందర్ని ఆందోళనకు గురిచేసింది. అయితే వీరిని ఎట్టకేలకు సురక్షితంగా బయటకు తీసుకుని రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే అత్యాధునిక యంత్రాలు, ఆగర్ మెషిన్లు, ఉన్నత చదువులు చదివిన ఉద్యోగులు చేయలేని పనిని ర్యాట్ హోల్ వర్కర్లు చేశారు. సొరంగంలో చిక్కుక్కుపోయిన కార్మికులను కాపాడారు. ఈ క్షణాలను దేశం మొత్తం ఆత్రుతగా చూసింది, మతం, భాష, కుల భేదాలను చెరిపివేసి ర్యాట్ వర్కర్లు సొరంగం లోపల నుండి వారిని ఒక్కొక్కరుగా బయటకు తీసుకువచ్చారు.

146 మంది ఎంపీలపై వేటు

భారత పార్లమెంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మోడీ ప్రభుత్వం ఏకంగా ఈ ఏడాది 146 మంది ఎంపిలపై బహిష్కరణ వేటు వేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, న్యాయమైన డిమాండ్లు చేయడమే ఈ 146 మంది ఎంపిల నేరమయింది.

ప్రతిపక్ష ఎంపీల ప్రవర్తనను 'అన్‌పార్లమెంటరీ బిహేవియర్'గా ఆరోపిస్తూ మోడీ ప్రభుత్వం ఈ వేటు వేసింది. అయితే వివాదాస్పద బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు, వ్యతిరేక స్వరాలకు అడ్డుకట్ట వేసేందుకు మోడీ ప్రభుత్వం ఈ వ్యూహం పన్నినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశాయి. అయితే తమ ఎంపీని సస్పెండ్ చేసినా తృణమూల్ కాంగ్రెస్ ఈ నిరసనల్లో పాల్గొనలేదు.

బాలేశ్వర్‌లో ఘోర రైలు ప్రమాదం

జూన్‌లో ఒడిశాలోని బాలేశ్వర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంతో దేశం ఒక్కసారిగా ఉల్కిపడింది. ఈ రైలు ప్రమాదంలో 300 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మూడు రైళ్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. చెన్నై వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా వెళ్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ఒక సరుకు రవాణా రైలు కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఒకే లైన్‌లో ప్రమాదానికి గురికావడంతో రైల్వే భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం

అంత్యకట్టుదిట్టమైన భద్రత ఉండే పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం చోటు చేసుకోవడం 2023లో మరొక ముఖ్యమైన ఘటన. అదీ కూడా పార్లమెంట్‌పై ఉగ్రవాదుల దాడి జరిగి 22 ఏళ్లు పూర్తయిన రోజున ఇద్దరు యువకులు లోక్‌సభ ప్రేక్షకుల గ్యాలరీ నుంచి ఎంపీల సీట్లపైకి హఠాత్తుగా దూకారు. వారు డబ్బాలో నుండి పసుపు రంగు పొగను స్ప్రే చేశారు. ఈ సంఘటనతో ఎంపీలు, పార్లమెంట్ సిబ్బంది ముందుగా ప్రాణభయంతో పరుగులు తీశారు. అయితే కొంతమంది ఎంపీలు ఈ ఇద్దరు యువకులను బంధించారు. పట్టుబడిన సాగర్ శర్మ, మనోరంజన్ అనే ఇద్దరు యువకులు బిజెపి ఎంపీ ప్రతాప్ సింహా 'పాస్'తో లోక్‌సభ గ్యాలరీకి ప్రవేశించారు. ఏదీమైనా ఈ ఘటన కొత్త పార్లమెంట్ భవనం వద్ద భద్రతా లోపాలను ఎత్తిచూపింది.

బ్యూఎఫ్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషన్ లైంగిక వేధింపులకు నిరసనగా ఆందోళన చేస్తున్న రెజర్లు

ప్రధాని క్రూరత్వం బాధ కలిగిస్తోంది : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ బ్యూరో: మహిళా రెజ్లర్ల పట్ల ప్రధాని క్రూరత్వం చూస్తుంటే బాధ కలుగుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ప్రముఖ రెజ్లర్ వినేష్ ఫోగాట్ ఖేల్ రత్న, అర్జున అవార్డులను కర్తవ్యపథ్‌లోని పేవ్‌మెంట్‌పై విడిచిపెట్టిన సంగతి తెలిసిందే. తన పతకాలను ప్రధానికి అందించేందుకు వినేష్ ఫోగాట్ బయలుదేరిన వీడియోను ఎక్స్‌లో రాహుల్‌గాంధీ షేర్ చేస్తూ, తన వ్యాఖ్యలను జత చేశారు. 'దేశంలోని ప్రతి కూతురికి ఆత్మ గౌరవమే మొదటి ప్రాధాన్యం. ఆ తర్వాతే ఏదైనా పతకం, గౌరవం వస్తాయి. ఈ ధీర వనితల కన్నీళ్ల కంటే 'బాహుబలి'గా ప్రకటించుకునే వారి నుంచి కలిగే రాజకీయ ప్రయోజనాలు ఎక్కువయ్యాయా? యావత్ దేశానికి ప్రధానమంత్రి సంరక్షకుడు. ఆయన వైపు నుంచి ఇటువంటి క్రూరత్వం చూస్తుంటే బాధ కలుగుతోంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. తనకు వచ్చిన ఖేల్‌రత్న, అర్జున అవార్డులను వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించుకున్న వినేశ్ ఫొగాట్.. వాటిని ప్రధాని నరేంద్ర మోడీకి అందజేసేందుకు శనివారం వెళ్లగా, ఆమెను పోలీసులు అడ్డుకోవడంతో వాటిని కర్తవ్యపథ్ వద్ద వదిలేశారు. అనంతరం వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బ్రిజ్‌భూషణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడిగా ఎన్నికవడాన్ని నిరసిస్తూ.. అవార్డులను వెనక్కి ఇచ్చేస్తామని వినేష్ ఫోగాట్ గతంలో ప్రకటించారు. రెజ్లర్లు న్యాయం కోసం పోరాడుతుంటే ఈ పతకాలు, సన్మానాలు అర్థరహితమని పేర్కొన్నారు.

బోయింగ్ విమానాల తనిఖీలు

- నిర్వహణపై హెచ్చరికలతో భారత్ అప్రమత్తం

న్యూఢిల్లీ : కొత్తగా నిర్మించిన బోయింగ్ 737 మ్యాక్స్ ప్యాసింజర్ ఎయిర్ క్రాఫ్ట్‌లలో బోల్టులకు నట్లులేవన్న హెచ్చరికల నేపథ్యంలో మనదేశంలోనూ ఆ విమానాల్లో తనిఖీలు చేపట్టారు. ఇటీవల రెండు 737 మ్యాక్స్ విమానాల్లో కీలకమైన భాగంలో బోల్టులకు నట్లు లేవని గుర్తించారు. విమానం పనితీరు నియంత్రించే కీలకమైన రడ్డర్ కంట్రోల్ వ్యవస్థలో ఈ లోపాన్ని గుర్తించినట్లు పేరు వెల్లడించని ఓ విమానయాన సంస్థ గుర్తించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ విమానాలను నిర్వహించే ఆకాశ ఎయిర్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్‌లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఆదివారం ప్రకటించింది. అమెరికాలోని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, బోయింగ్‌తో తాము టచ్‌లో ఉన్నామని, బోల్టులను సరి చూస్తున్నామని వెల్లడించింది. "విమానంలో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సర్వీస్ ఆపరేటర్లు సూచనలు జారీ చేస్తారు. ఈ విషయంలో బోయింగ్, ఎఫ్ఎఎతో సంప్రదింపులు జరుపుతున్నాం. సమస్య నివారణకు బోయింగ్ చెప్పిన చర్యలను విమానాల ఆపరేటర్లు చేపడతారు" అని డిజిసిఎ ఓ ప్రకటనలో తెలిపింది.

ఢిల్లీలో 400కి వాయు నాణ్యతా ప్రమాణం

న్యూఢిల్లీ : ఢిల్లీలో వాయు కాలుష్యం మరోసారి తీవ్రస్థాయికి చేరింది. దీంతో ప్రజలు శ్వాస పీల్చేందుకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం మరోసారి వాయు నాణ్యతా ప్రమాణం (ఎక్యూఐ) 400కి చేరుకుంది. పెరుగుతున్న చలితో, ఉష్ణోగ్రతలతో నిరంతర ఎక్యూఐలో క్షీణత కనిపిస్తుంది. దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. మరో మూడు రోజుల పాటు ప్రమాదకర పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించింది.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం.. ఢిల్లీలో 24 గంటల సగటు ఎక్యూఐ శనివారం 401 కి చేరుకుంది. ఇది 'డేంజర్' జోన్‌లో ఉంది. సాయంత్రం 4 గంటలకు, ఎక్యూఐ 'చాలా పేలవమైన' స్థాయికి చేరుకుంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు 382 (వెరీ పూర్), గురువారం 358 (వెరీ పూర్) గా ఉంది. నూతన సంవత్సర వేడుకల్లో బాణా సంచా పేల్చడంతో 400 దాటే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. గత రెండు రోజులుగా నగరంలో పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడమే గాలి నాణ్యత లోపానికి కారణమని అన్నారు.

దేశ ప్రజల్లో వికసిత్ భారత్ స్ఫూర్తి

- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది దేశం ఎన్నో ఘనతలు సాధించిందని గుర్తుచేశారు. 2023లో దేశ ప్రజల్లో వికసిత్ భారత్ స్ఫూర్తి రగిలిందన్నారు. దాన్ని కొత్త సంవత్సరంలోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆదివారం ప్రసారమైన 2023 చివరి 'మన్ కీ బాత్'లో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న మహిళా బిల్లుకు ఈ ఏడాదిలోనే ఆమోదం లభించిందన్నారు. భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని పేర్కొన్నారు. జి-20 సదస్సును విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ప్రతి ప్రాంతం ఎంతో ఆత్మవిశ్వాసంతో నిండి ఉందని, దేశ ప్రజల్లో వికాస, స్వయం సమృద్ధి స్ఫూర్తి రగిలిందని చెప్పారు. 2024లోనూ దాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ ఏడాది 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో దేశం మొత్తం ఉర్రూతలూగిందని మోడీ అన్నారు. 'ఎలిఫెంట్ విస్పరర్స్'కు సైతం ప్రతిష్టాత్మక అవార్డు రావటంతో భారతీయుల ప్రతిభ వెలుగుచూసిందని వ్యాఖ్యానించారు. ఆసియా క్రీడల్లో 107, పారా గేమ్స్‌లో 111 పతకాలతో క్రీడాకారులు సత్తాచాటారని గుర్తు చేశారు. వన్డే ప్రపంచ కప్‌లో భారత క్రికెట్ జట్టు అందరి మనసులు గెలుచుకుందని ప్రశంసించారు. శాస్త్రవేత్తల కృషితో చంద్రయాన్-3 విజయవంతమైందని, ఇది అందరికీ గర్వకారణమని అన్నారు. శారీరక, మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత కోసం 'ఫిట్ ఇండియా'లో భాగంగా తీసుకున్న చర్యలను వెల్లడించారు. భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్, చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, నటుడు అక్షయ్ కుమార్ తమ ఫిట్నెస్ రహస్యాలను పంచుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు
సిడ్నీ, ఆక్లాండ్‌లో ముందుగా..

న్యూఢిల్లీ : 2024 నూతన సంవత్సర వేడుకలు ప్రపంచవ్యాప్తంగా హోరెత్తాయి. సిడ్నీ, ఆక్లాండ్ నగరాల్లో ఈ వేడుకలు ముందుగా ప్రారంభమయ్యాయి. సిడ్నీ హార్బర్, ఆక్లాండ్‌లోని స్కై టవర్ వద్ద అద్భుతమైన బాణసంచా ప్రదర్శనలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సిడ్నీ హార్బర్ వంతెనపై సుమారు 12 నిమిషాలపాటు టన్నుల కొద్దీ బాణసంచా కాల్చారు. ఈ వేడుకను చూడ్డానికి ఇతర దేశాల నుంచి కూడా పర్యాటకులు వచ్చారు. ఆక్లాండ్‌లోని 328 మీటర్ల ఎత్తయిన కమ్యూనికేషన్స్ అండ్ అబ్జర్వేషన్ టవర్‌పై కాల్చిన బాణాసంచా నగరం మొత్తాన్ని వెలుగులతో నింపింది. వాటికన్ సిటీలో నూతన సంవత్సర వేడుకల ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 2023ను యుద్ధ బాధల సంవత్సరంగా పోప్ ఫ్రాన్సిస్ గుర్తు చేసుకున్నారు. సెయింట్ పీటర్స్ స్క్వేర్‌కు ముందున్న కిటికీ నుంచి పోప్ సాంప్రదాయ ఆశీర్వాదం ఇచ్చారు. బాధించబడుతున్న ఉక్రెయిన్, పాలస్తీనా, ఇజ్రాయిల్, సూడాన్ ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల ప్రజల కోసం పోప్ ఫ్రాన్సిస్ ప్రార్థనలు చేశారు. 'యుద్ధంలో ఎన్నో మానవ జీవితాలు ఛిద్రమయ్యాయి. ఎంతోమంది మరణించారు. ఎన్నో బాధలు, ఎంతో పేదరికాన్ని బాధితులు అనుభవిస్తున్నారు' అని పోప్ తెలిపారు.న్యూయార్క్ నగరంలో టైమ్స్ స్క్వేర్ వద్ద వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు బెదిరింపులు రావడంతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. డ్రోన్లతోనూ నిఘా పెట్టారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో నూతన వేడుకలకు భారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. 2024లో పారిస్‌లో ఒలింపిక్స్ జరుగుతుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 2న ఈఫిల్ టవర్ వద్ద కత్తిపోట్ల సంఘటన చోటు చేసుకోవడంతో భారీ భద్రత ఏర్పాటు చేశారు. జర్మనీ బెర్లిన్‌లోనూ వేడుకలకు భారీగా మోహరించారు. వీధుల్లో ఫైర్ క్రాకర్ల వాడకంపై అధికారులు నిషేధం విధించారు. పాలస్తీనా వాసులకు సంఘీభావంగా పాకిస్తాన్‌లో నూతన సంవత్సర వేడుకలపై ప్రభుత్వం నిషేధం విధించింది.

18 ఏళ్ల దళిత యువతిపై అమానుషం

- బెల్లం తయారీ కొలిమిలోకి తోసేశారు

లక్నో: లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు ఓదళిత యువతిని బెల్లం తయారీ యూనిట్‌లోని కొలిమిలోకి తోసేశారు. ఈ దారుణ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని బుదౌన్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రస్తుతం ఆమె ఢిల్లీలోని జిటిబి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది, ఆ బెల్లం తయారీ యూనిట్ యజమానితో సహా ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. బినౌలీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎంపి సింగ్ మాట్లాడుతూ ముజఫర్‌నగర్‌లో నివాసం ఉండే మహిళ ఆ గ్రామంలోని ప్రమోద్ వద్ద పని చేస్తోంది. బినౌలీ సోదరుడు పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నదాని ప్రకారం బుధవారం, ఆమె బెల్లం తయారీ కొలిమి వద్ద పనిచేస్తుండగా, ప్రమోద్, రాజు, సందీప్‌లతో కలసి వేధించారు. అసభ్యంగా ప్రవర్తించారు.. దీనికి బినఃలి నిరసన తెలపడంతో ఆ ముగ్గురూ ఆమెను చంపాలనే ఉద్దేశంతో మండుతున్న కొలిమిలోకి తోసేశారు. కులం పేరుతో దూషించారు. అనంతరం ముగ్గురు నిందితులు పరారయ్యారు.

ఆమె సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులు ప్రమోద్, రాజు, సందీప్‌లపై సెక్షన్ 354 (ఆమె నిరాడంబరతను కించపరిచే ఉద్దేశంతో మహిళపై దాడి లేదా నేరపూరిత బలవంతం), 504 (ఉల్లంఘనను రెచ్చగొట్టే ఉద్దేశంతో ఉద్దేశపూర్వకంగా అవమానించడం) కింద కేసు నమోదు చేసి, వారిని . అరెస్టు చేశారు.

చెట్ల అక్రమ నరికివేత కేసులో బిజెపి ఎంపి ప్రతాప్ సింహా సోదరుడు అరెస్ట్

బెంగళూరు : పార్లమెంట్ భద్రతా వైఫల్య ఘటనలో నిందితులకు విజిటింగ్ పాస్ ఇచ్చిన బిజెపి ఎంపి ప్రతాప్ సింహా సోదరుడు విక్రమ్ సింహా అరెస్టయ్యారు. కోట్లాది రూపాయల విలువైన చెట్లను నరికినందుకు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం అటవీ శాఖ కస్టడీలో ఉన్నారు. కర్ణాటక హసన్ జిల్లాలో రూ.126 కోట్ల విలువైన చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ కేసులో విక్రమ్ ప్రమేయం ఉన్నట్లు 'అందుబాటులో ఉన్న డాక్యుమెంటరీ సాక్ష్యం' సూచించిందని అధికారిక నివేదిక పేర్కొంది. అటవీశాఖ అధికారులు, క్రైమ్ బ్రాంచ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి, విక్రమ్‌ను అరెస్ట్ చేశాయి. ఆయనను హసన్‌కి తరలించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

తెహ్రీక్ -ఎ-హురియత్‌పై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ : కాశ్మీర్ వేర్పాటువాద సంస్థ తెహ్రీక్-ఎ- హురియత్ (టిఇహెచ్)పై కేంద్ర ప్రభుత్వం ఆదివారం నిషేధం విధించింది. జమ్ముకాశ్మీర్‌లో ఈ సంస్థ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని, భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారాన్ని, తీవ్రవాద కార్యకలాపాలను కొనసాగిస్తోందని గుర్తించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. "చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద తెహ్రీక్-ఎ-హురియత్ జెకెను చట్టవిరుద్ధ సంఘంగా ప్రకటించారు. భారత్ నుండి జమ్ముకాశ్మీర్‌ను వేరుచేసి ఇస్లామిక్ పాలనను స్థాపించేందుకు ఈ సంస్థ నిషేధిత కార్యకలాపాలలో పాల్గొంటోంది" అని అమిత్‌షా ఎక్స్ లో పేర్కొన్నారు. టిఇహెచ్‌కి గతంలో సయ్యద్ అలీ షా గిలానీ నాయకత్వం వహించారు. ఆయన మరణానంతరం మసరత్ ఆలం భట్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం భట్ జైలులో ఉన్నారు. ఆయన పార్టీ ముస్లిం లీగ్ ఆఫ్ జమ్ముకాశ్మీర్‌ను డిసెంబర్ 27న కేంద్రం నిషేధిత సంస్థగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

పెరుగుతున్న కుక్కకాటు కేసులు

- ఏడాదిలో ఆరు లక్షల కేసుల పెరుగుదల

న్యూఢిల్లీ : దేశంలో కుక్కకాటు కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 2022తో పోలిస్తే 2023లో దాదాపు ఆరు లక్షల కేసులు పెరిగాయి. కుక్కకాటుకు గురైన వారిలో రాబిస్ వ్యాధితో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య అధికంగా ఉంటోంది. 2030 నాటికి దేశంలో రాబిస్ పూర్తిగా నిర్మూలించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా కన్పించడం లేదు. రాబిస్‌ను సమూలంగా నిర్మూలించే విషయంపై గత నెలలో నీతి ఆయోగ్ జాతీయ స్థాయిలో సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. వ్యాధి కారణంగా చోటుచేసుకుంటున్న మరణాలపై ప్రజలలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రానికి సిఫార్సు చేసింది.

డిసెంబర్ ప్రారంభం నాటికి దేశంలో మొత్తం 27.5 లక్షల కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. 2022లో వచ్చిన 21.8 లక్షల కేసులతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. కుక్కకాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న వారిలో 96% మరణాలకు రాబిస్ వ్యాధే కారణమని అధికారులు చెబుతున్నారు. 2015లో దేశంలో రాబిస్ కారణంగా 20,847 మంది చనిపోయారు. ప్రపంచ దేశాలన్నింటితో పోలిస్తే ఈ సంఖ్య బాగా ఎక్కువ. ప్రపంచంలో ప్రతి సంవత్సరం 60 వేల మంది నయం చేయడానికి వీలుకాని వ్యాధితో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలు, ఆరోగ్య సిబ్బందిలో అవగాహన లేకపోవడంతో రోగులకు సకాలంలో చికిత్స అందించలేకపోతున్నారు.

నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా ప్రకటించాలి

- ఐసిజెను కోరిన దక్షిణాఫ్రికా

జొహానెస్‌బర్గ్: గాజాలో పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా ప్రకటించాలని అంతర్జాతీయ నేర విచారణ న్యాయస్థానం (ఐసిజె)ను దక్షిణాఫ్రికా కోరింది. యాదు దురహంకార సైన్యం గాజాపై దురాక్రమణ పూరిత దాడులు 84వ రోజు (డిసెంబరు29)కు చేరిన వేళ దక్షిణాఫ్రికాలోని రమాఫోసా ప్రభుత్వం అంతర్జాతీయ నేర విచారణ కోర్టులో ఈ మేరకు ఒక పిటిషన్ దాఖలు చేసింది. నెతన్యాహును ప్రాసిక్యూట్ చేయడంతో బాటు, గాజాపై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే నిలుపు చేసేలా ఆదేశించాలనికోరింది. ఇజ్రాయిల్ హంతక దాడులు ఊచకోత స్వభావాన్ని కలిగి ఉన్నాయని, పాలస్తీనాలో చాలా ప్రాంతాన్ని నాశనం చేశాయని, ఇజ్రాయిల్ దళాలు జాతి నిర్మూలనే లక్ష్యంగా గాజాలో రక్తపుటేరులు పారిస్తున్నాయని, దీని వల్ల అక్కడి పాలస్తీనీయులు భౌతికంగా, మానసికంగా అనుభవిస్తున్న క్షోభ వర్ణనాతీతమని ఆ పిటిషన్‌లో దక్షిణాఫ్రికా పేర్కొంది. అంతేకాదు, పాలస్తీనీయులను తమ ఇళ్ల నుంచి బలవంతంగా గెంటివేయడం, సామూహికంగా నివాస ప్రాంతాలపై దాడులు, ఇళ్లను నేలమట్టం చేయడం వంటి దాష్టీకాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. ఆహారం, మందులు, గూడు, పరిశుభ్రత, పారిశుధ్యం ఇలా అనేక సమస్యల మధ్య అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పిటిషన్‌లో తెలిపింది. పాలస్తీనా ప్రజల జీవితానలు నాశనం చేసే హక్కు ఇజ్రాయిల్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించింది. పాలస్తీనీయులు గాజా గడ్డపై జన్మించకుండా చేసేందుకు ఆసుపత్రులపైనా దాడులకు తెగబడిందని విమర్శించింది. అక్టోబరు 7 నుంచి ఇప్పటివరకు 22 వేల మంది దాకా పాలస్తీనీయులు చనిపోయారు. మరో 7,780 మంది జాడ తెలియడం లేదు. బహుశా వీరంతా భవన శిథిలాల కింద సమాధి అయిపోయి వుండొచ్చని భావిస్తున్నారు. ఈ ఫాసిస్టు దాడుల వల్ల 19 లక్షల మంది అంటే గాజా జనాభాలో 85 శాతం మంది బాంబు దాడుల్లో ఇళ్లు కోల్పోయి వీధిన పడ్డారు. గాజాలో పాలస్తీనా కుటుంబాల్లో మరణాల రేటు పెరిగిపోయిందని డబ్ల్యుసిఎన్ ఎస్ఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ హంతక దాడుల్లో కొన్ని కుటుంబాల్లో గాయపడిన ఒక బాబు లేదా పాప మాత్రమే మిగిలి మిగతా వారంత చనిపోయిన పరిస్థితి ఉంది. మృతుల్లో పిల్లలు, మహిళలు ఎక్కువగా ఉంటున్నారు. ఏ ప్రాంతమూ సురక్షితం కాదు. అని ఆ పిటిషన్‌లో పేర్కొంది. హేగ్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రాజకీయాలకు, పక్ష పాతానికి అతీతమైనదే మీ కాదని పలు సందర్భాల్లో రుజువైంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో పశ్చిమ దేశాల ప్రభావంతో పుతిన్‌ను యుద్ధ నేరస్తుడిగా ఏకపక్షంగా ప్రకటించిన ఐసిజె, గాజాలో ఇన్ని రోజులుగా, ఇంత భయానకంగా పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న నెతన్యాహు విషయంలో గమ్మున ఉండడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దక్షిణాఫ్రికా ప్రభుత్వ అభ్యర్థనపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఏ